ఆరు గ్యారెంటీలతో మోసం

- కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెప్పాలి
- బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి
- వెస్ట్ మారేడ్‌పల్లిలో పార్కులో వాకర్లతో సమావేశం

కంటోన్మెంట్, ఏప్రిల్ 7: ఆరు గ్యారెంటీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ వంటి అన్ని పథకాల్లో మోసం చేశారని దుయ్యబట్టారు. ఆదివారం వెస్ట్ మారేడుపల్లిలోని నెహ్రూ నగర్ పార్కులో ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి వాకర్స్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారీ మెజారిటీతో గెలిపిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ దేశాలు ప్రశంసించేలా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికైన తర్వాత రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను వినియోగించుకోలేక పోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్కాజిగిరి నియోజక వర్గం అభివృద్ధికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కోట్లాది రూపాయలను ఖర్చు చేశారని పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

వెస్ట్ మారేడ్‌పల్లిలోని నెహ్రూ పార్కులో వాకర్స్‌తో సమావేశానికి వెళుతున్న బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని సరిగ్గా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, పలు వార్డుల బీఆర్ఎస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, వాకర్స్, నెహ్రూ నగర్ పార్కు డెవలప్ మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న నెహ్రూ నగర్ పార్కు డెవలప్ మెంట్ కమిటీ సభ్యులు

గులాబీ జెండా ఎగరడం ఖాయం

మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో సమావేశమైన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 7: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తో పాటు మల్కాజిగిరి ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై గులాబీ ముఖ్య నేతలకు తలసాని దిశానిర్దేశం చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంతో పాటు మల్కాజిగిరి ఎంపీ స్థానం లోనూ గులాబీజెండా ఎగరడం ఖాయమని తలసాని శ్రీనివాస్ యాదవ్ దీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, పెద్దాల నర్సింహయాదవ్‌తో పాటు తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న స్కైఫౌండేషన్ సభ్యులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 7 : పద్మారావునగర్‌కు చెందిన స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్ల పక్కన ఉంటున్న నిరాశ్రయులు, అనాథలకు దుస్తులను, పాదచారులకు, ఆర్‌టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి కాలంలో నగరంలో ఎండలు తీవ్రంగా ఉండటం వలన, తాము ప్రతి ఆదివారం మజ్జిగ, అంబలి, తాగునీరు పంపిణీ చేస్తున్నామని స్కైఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. సభ్యులు అఖిల్, హరీశ్ కుమార్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న హునార్ మహోత్సవ్ మేళా

కంటోన్మెంట్, ఏప్రిల్ 7: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో గత నెల 28న ప్రారంభమైన హునార్ మహోత్సవ మేళా సోమవారంతో ముగియనుంది. ఈ మేళాకు నగర ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని నిర్వాహకులు దీపక్ శుక్ల, రిషి కుమార్ తెలిపారు. ఆదివారం జింఖానా మైదానంలోని హునార్ మహోత్సవ మేళా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జింఖానా మైదానంలో గతంలో నిర్వహించిన మేళాకు విశేష స్పందన వచ్చిందని వివరించారు. గతంలో కంటే ఎక్కువగా వ్యాపారం జరిగిందని, రంజాన్, ఉగాది పర్వదినాలను పురస్కరించుకొని వినియోగదారుల నుంచి మంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంటిల్లిపాదికి అవసరమైన దుస్తులు, గృహపకర వస్తువులు, ఫుడ్ స్టాల్స్ ఒకే వేదికలో ఉండడంతో విజయవంతమైందన్నారు.


బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలను తెలుపుతున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

పద్మారావు గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ

అడ్డగుట్ట, ఏప్రిల్ 7 : బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతలు ఆదివారం ఆయనను కలిసి శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా పద్మారావు పార్టీశ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం కార్పొరేటర్, పార్టీశ్రేణులు ఆయనకు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, నేతలు శ్రీనివాస్ గౌడ్, మహ్మద్, అల్లా బక్షు, యాదగిరి, పొన్నాల రాజు, నర్సింగ్, అమర్, వడ్లూరి రవి, వసంత, మహేశ్వరి, విమల, చిన్న పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్..

సికింద్రాబాద్,ఏప్రిల్7: ఎమ్మెల్యే, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరాటే రాజు, మహిళా నాయకులు మని మంజరి, అనిత, అరుణ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు

సికింద్రాబాద్ ఎమ్మెల్యే, పార్లమెంట్ నియోకజవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ సామల హేమ

అంబేద్కర్‌నగర్ బస్తీలో చర్చి ప్రారంభం

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 7: మారేడ్‌పల్లి లోని రైల్‌నిలయం అంబేద్కర్ నగర్ బస్తీలో నూతంగా నిర్మించిన 'జీసస్ క్రిస్ట్ ప్రేయర్ పవర్ మినిస్ట్రీస్' చర్చిని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంతోష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చర్చి నిర్మాణం కోసం సహాయ, సహకారాలు అందించిన సంతోష్ యాదవ్‌ను చర్చి నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాదర్ యోన, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, రాము, శివ, అబ్రహ్మం, ప్రతిక్, వేణు చారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సికింద్రాబాద్,ఏప్రిల్7: ఇటీవలే కాంగ్రెస్ ప్రకటించిన పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు స్థానం కల్పించకుండా చేసిన తీవ్రమైన అన్యాయాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం సీతాఫల్‌మండి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్‌మాదిగ, కొమ్ము శేఖర్, తుమ్మల శివప్రసాద్, నర్సింగ్, గసగంటి విజయకుమార్, మహేందర్, దేవేందర్, సుజాత, మురళీధర్ పాల్గొన్నారు.

పండుగలు ఘనంగా నిర్వహించాలి

కంటోన్మెంట్, ఏప్రిల్ 7: ఆలయ కమిటీ సభ్యులు రానున్న ఉగాది, శ్రీ రామ నవమి పండుగలను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సూచించారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఆరో వార్డులోని సీతారాంపురంలో నెలకొని ఉన్న శివ పంచాయతన్ ఆంజనేయస్వామి ఆలయం వార్షిక సమావేశాలు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆలయ అభివృద్ధితో పాటు నూతన కార్యవర్గం ఏర్పాటు విషయాలపైన సమావేశంలో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

తిరుపతికి స్వరమాధురి ఉగాది నంది పురస్కారం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 7: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని నిజాం కళాశాల సోషియాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ దీకొండ తిరుపతికి స్వరమాధురి ఉగాది నంది పురస్కారం వరించింది. ఈ మేరకు చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఒకవైపు సమాజ సేవలో నడుస్తూ, మరోవైపు అధ్యాపకుడిగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నందుకు ఆయనకు ఈ అవార్డును అందజేస్తున్నట్లు స్వరమాధురి వ్యవస్థాపక అధ్యక్షురాలు సాయి పావని తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రంగంపేట గ్రామానికి చెందిన ఆయన ఓయూలోనే ఎంఏ తెలుగు, ఎంఏ సోషియాలజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2006 నుంచి 2011 వరకు యూజీసీ ఆశిష్ ప్రాజెక్టులో రీసర్చ్ ఫెలోగా పనిచేశారు. 2012 నుంచి నిజాం కళాశాల సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఇన్‌చార్జి హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నిజాం కళాశాల ఈక్వల్ అపార్చునిటీస్ సెల్ కోఆర్డినేటర్‌గా సైతం పనిచేస్తూ వివిధ పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో ఆయన న్యూఢిల్లీలో దళితరత్న అవార్డును సైతం అందుకున్నారు.

డాక్టర్ దీకొండ తిరుపతికి అవార్డు అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్

కాంగ్రెస్ ముఖ్యనేతలతో సీఎం సమావేశం

అడ్డగుట్ట. ఏప్రిల్ 7 : పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగిరేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని ముఖ్యనేతలతో పాటు ఆదం సంతోష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదం సృజన్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు శ్రమించాలని, ఎన్నికల్లో అవలంబించాల్సిన విధానాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేసినట్లు ఆదం సంతోష్‌కుమార్ తెలిపారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

బస్తీ వాసులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేశ్

కంటోన్మెంట్, ఏప్రిల్ 7: నియోజకవర్గంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తానని కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేశ్ అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి సకల సౌకర్యాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ఆదివారం మూడో వార్డు మడ్‌ఫోర్డ్ అంబేద్కర్‌నగర్‌లో స్థానికులతో కలిసి శ్రీ గణేష్ పర్యటించారు. బస్తీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పలు సమస్యలను శ్రీ గణేష్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీ గణేశ్ మాట్లాడుతూ రానున్న ఉప ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను కంటోన్మెంట్‌లోని ప్రతి గడపకు అందజేస్తామని తెలిపారు. ఇది పేదల ప్రభుత్వమని, వంద రోజుల్లోనే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకుందని చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టడంలో కాంగ్రెస్ సర్కారు కృషి చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం మడ్ ఫోర్డ్ కాలనీకి చెందిన స్థానికులు పూలమాల, శాలువాలతో శ్రీ గణేశ్‌ను సన్మానించి తమ పూర్తి మద్దతు మీకే అంటూ నినాదాలు చేశారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 7: ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు గ్యార నరేశ్, నెల్లి సత్యడిమాండ్ చేశారు. తార్నాకలో తరగతులు నిర్వహిస్తున్న వెంకన్న జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్చి 31వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు అన్ని కళాశాలలకు బోర్డు సెలవులు ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ వెంకన్న జూనియర్ కళాశాల ఈ నిబంధనలను పాటించకుండా తరగతులు నిర్వహిస్తోందని మండిపడ్డారు. శ్రీచైతన్య, నారాయణ తదితర కళాశాలలు కూడా క్లాసులు నిర్వహిస్తూ, ప్రవేశాలు నిర్వహిస్తున్నాయని దుయ్యబట్టారు. దీనిపై తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చైతన్యయాదవ్, కళ్యాణ్, అనిల్, అరుణ్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

అడ్డగుట్ట, ఏప్రిల్ 7: బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను ఆదివారం మెట్టుగూడ బీఆర్ఎస్ నేతలు కలిసి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను నేతలు గజమాలతో సత్కరించారు. పద్మారావుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేశ్ గౌడ్(పెద్దన్న), సీనియర్ నాయకులు కృష్ణ, ప్రకాశ్, అశోక్, యువ నాయకులు శ్రీకాంత్ ఉన్నారు.

బాటసారులకు పెరుగన్నం పంపిణీ

అమీర్‌పేట్, ఏప్రిల్ 7 : మండుటెండల్లో అల్లాడిపోయే వారికి.. కాస్తంత పెరుగన్నం దొరికితే.. ఆ ఎండ పూటకు అది ఆకలి తీర్చడమే కాదు.. అలసట తీర్చి ఎంతో సాంత్వన చేకూరుతుంది. ఎండల్లో రోడ్లపై సంచరిస్తుండే బాటసారుల కోసం చల్లటి మజ్జిగతో పాటు పెరుగన్నం ఉచితంగా అందిస్తే బాగుంటుందన్న సేవా భావ సారూప్యత కలిగిన కొందరి ఆలోచన కార్యరూపం దాల్చి సరిగ్గా 9 సంవత్సరాలు అవుతుంది. సనత్‌నగర్ మోడల్ కాలనీకి చెందిన జేఎస్‌టి శాయి. దండా బుచ్చిబాబు, శశికుమార్, మాచవరం రవీందర్ బాబు, శ్రీనివాస్ తదితరులు 2015లో మానవ సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పి.. దాని ద్వారా తమ వంతు సామాజిక సేవలు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం ఉగాది రోజున ప్రారంభమయ్యే ఈ శిబిరం ఈ సంవత్సరం మార్చి నెలలోనే ప్రారంభమైంది.

పెరుగన్నం పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

మూగజీవాల రక్షణ అందరి బాధ్యత

బేగంపేట్, ఏప్రిల్ 7 : మూగజీవాల పరిరక్షణ అందరి బాధ్యత అని జైన గురువు తీర్థ్ సుందర మహారాజ్ పేర్కొన్నారు. జంతువుల పరిరక్షణకు పోరాడుతున్న జీహెచ్ఎస్‌పీసీఏ ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేట్ సింధీ కాలనీలోని జైన్ మందిర్‌లో మూగజీవాల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీర్థ్ సుందర మహారాజ్ మాట్లాడుతూ జంతువులను కూడా తమ లాగే జీవులుగా పరిగణిస్తూ వాటి ఆకలి, దాహాలను తీర్చడం బాధ్యతగా భావించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జంతు పరిరక్షణ సంస్థ సలహాదారు మహీప్ జైన్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో మూగజీవాలకు చక్కటి వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పీపుల్స్ ఫర్ ఎనిమల్ సంస్థ చైర్మన్ మేనకా గాంధీ ఈ మేరకు నగరంలో 550 గజాల స్థలాన్ని కూడా కేటాయించారన్నారు. హైదరాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న 10 ఒంటెలను గుర్తించి ఆసిఫ్‌నగర్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా వాటిని, తిరిగి రాజస్థాన్‌లోని మహావీర్ శాంక్చురీకి తరలించడం జరిగిందని తెలిపారు. ఎనిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు గిరీశ్ షా, ప్రముఖ నటుడు అశోక్‌కుమార్, దినేశ్ అంచాలియా, సురేందర్ భండారి, జోషి, భండారి, డాక్టర్ విశ్వచైతన్య పాల్గొన్నారు.

మూగజీవాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE : MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT : MALKAJGIRI
O.S. NO. 226 OF 2021
Between:
Gummadi Tejesvi @ Tejaswni ...Plaintiff
AND
Gummadi Nitin Reddy and Others ...Defendants
To,
Gummadi Haritha Reddy, (Defendant No. 10) Wife of Late Gummadi Panduranga Reddy, Aged about 59 years, Resident of House No. 3-52, Burtonguda, Bollarum, Secunderabad-500010.
Madam,
Take notice that the Plaintiff herein has filed the above referred suit for partition, separate possession and perpetual injunction. In the said suit you are arrayed as party Defendant No.10 wherein you are required to enter appearance personally or through duly instructed counsel on 02-05-2024 at 10:30 A.M. in the court. On your failure to appear on the said date you will be set ex-partee and the matter will be decided in your absence.
(By order of the Court)
Sd/- **Sri. S. Balchand, Sancheti Deepak Aditya Lalwani,** Advocates
M/s. S. Balchand Deepak & Co.
Advocates & Solicitors
3-5-1/5, Ramkote, Hyderabad. 500001.
Counsel for Plaintiff
Hyderabad.Dated:- 05-04-2024